నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్, మంగళవారం 22 ఏప్రిల్ 2025 | ADILABAD NIRMAL

మంత్రి ప్రారంభించినా పడిగాపులే..

ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో రైతుల నిరీక్షణ

గేటుకు తాళం

ఆదిలాబాద్ మార్కెట్ యార్డు ఎదుట జొన్న వాహనాలు

అధికారికి విన్నవిస్తున్న రైతులు

ఆదిలాబాద్, ఏప్రిల్ 21(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో జొన్న పంటను విక్రయించుకోవడానికి రైతులు పడిగాపులు కాస్తున్నారు. శనివారం జొన్నల కొనుగోలు కేంద్రా న్ని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ప్రారంభించారు. దీంతో సోమవారం ఉదయం తలమడుగు మండలంలోని కజ్జర్ల రైతులు 40 ట్రాక్టర్లలో పంటను విక్రయించడానికి మార్కెట్ యార్డుకు తీసుకొచ్చారు. మద్దతు ధర రూ.3,371తో అమ్ముకుందామని వచ్చిన రైతులకు నిరాశే ఎదురైంది. మార్కెట్ యార్డు గేటుకు తాళం వేసి ఉండడంతో చేసేదేమీ లేక బయట వాహనాలను నిలిపివేశారు. వాహనాలను లోనికి అనుమతించాలని, పంట ఉత్పత్తులను కొనుగోలు చేయాలని రైతులు అధికారులకు విన్నవించారు. ఉదయం 11.30 గంటలకు గేటు తీసి వాహనాలను లోనికి అనుమంతించినా.. కొనుగోళ్లు జరపలేదు. దీంతో రైతులు పంటకు కాపలా కాయాల్సిన పరిస్థితి నెలకున్నది. ప్రభుత్వం ఎకరాకు 14 క్వింటాళ్లు కొనుగోలు చేస్తున్నందున ఆన్‌లైన్‌లో అప్‌డేట్ కాలేదని, మంగళవారం నుంచి కొనుగోలు చేస్తామని అధికారులు తెలిపారు.

చుక్క నీరులేక ఎండిపోయి నెర్రలువారిన చిక్‌మాన్ ప్రాజెక్టు

నెర్రలువారిన చిక్‌మాన్

- ప్రాజెక్టు పరిధిలో ఎండుతున్న పంటలు
- పశువుల మేతకు జొన్న

ఇచ్చోడ(సిరికొండ), ఏప్రిల్ 21 : మండలంలోని చిక్‌మాన్ ప్రాజెక్టు పరిధిలో వేసిన పంటలు వట్టిపోతున్నాయి. 1,550 ఎకరాలకు సాగు నీరందించడానికి రూ.12.50 కోట్లతో 2006లో చిక్‌మాన్ ప్రాజెక్టును నిర్మించారు. దీని సామర్థ్యం 160 మిలియన్ క్యూబిక్ ఫీట్(ఎంసీఎఫ్) కాగా.. ప్రస్తుతం 5 ఎంసీఎఫ్ ఉంది. దీని పరిధిలో యాసంగిలో రైతులు జొన్న, మొక్కజొన్న, తర్బూజా సాగు చేశారు. వర్షాకాలంలో వరదకు ఎగువ ప్రాంతం నుంచి మట్టి వచ్చి ప్రాజెక్టులో చేరింది. దీంతో నీరు నిలువ లేక మైదానంగా మారి నెర్రలు వారింది. గడిచిన 18 ఏళ్లలో ప్రాజెక్టు ఇప్పటివరకు ఎండిన దాఖలాలు లేవని రైతులు పేర్కొంటున్నారు. కాగా.. మండల కేంద్రానికి చెందిన రైతు బియ్యాల మల్లేశ్ ఐదెకరాల భూమిని కౌలుకు తీసుకుని జొన్న వేశాడు. చిక్‌మాన్ ప్రాజెక్టులో నీరు లేకపోవడంతో మూడెకరాల్లో పంటకు నీరు సరిపోకపోవడంతో చేసేది ఏమి లేక పంటను పశువుల మేతకు వదిలేశాడు.

తర్బూజ పంట ఎండింది..

నాకున్న రెండెరాల్లో రూ.1.50 లక్షలు పెట్టి తర్బూజ పంట వేశా. చిక్‌మాన్ ప్రాజెక్టు నీరు అందలేదు. రూ.70 వేలు పెట్టి బోరు వేసిన చుక్క నీరు పడలేదు. తర్బూజ పంటకు నీరందక ఎండింది. సుమారు రూ.2 లక్షలు నష్టపోయా. ప్రభుత్వం నష్టపరిహారం అందించాలి. చిక్‌మాన్ ప్రాజెక్టు పూడికతీత పనులు చేయాలి. నాలాంటి చిన్న సన్నకారు రైతులు యాసంగి పంట వేయలేకపోతున్నారు. **- మోరే రామకృష్ణ, రైతు, రాంపూర్, సిరికొండ.**

సిరికొండ జొన్న పంటను పశువులను మేపుతున్న రైతు

పంట ఎండింది..

నాకున్న నాలుగెకరాల్లో జొన్న పంట వేశా. నీరు లేకపోవడంతో పంట ఎండింది. అధికారులు చిక్‌మాన్ ప్రాజెక్టులో మట్టి తీస్తే బాగుంటుంది. 18 సంవత్సరాల్లో తొలిసారి చిక్‌మాన్ ఎండిపోయింది. నీరు లేక చిక్‌మాన్ ప్రాజెక్టు కింద సాగు చేస్తున్న రైతులు పంటలు ఎండిపోయాయి. భూగర్భ జాలాలు ఇంకిపోవడంలో బోర్లు వేసిన ప్రయోజనం లేకుండా పోయింది. **- ఎర్గిడే ఇస్తారి, రైతు, సిరికొండ**

వడదెబ్బతో ముగ్గురి మృతి

శంకర్(ఫైల్)

రాజు(ఫైల్)

చౌహాన్ కేశవ్(ఫైల్)

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 21 : నిర్మల్ పట్టణంలోని కురన్నపేట్ కాలనీకి చెందిన నిగులపు శంకర్(48), నిగులపు రాజు(42) వడదెబ్బతో మృతి చెందారు. వృత్తిరీత్యా వీరిద్దరూ రోజు వారి కూలీ పని చేసుకుంటూ డప్పులు కొడుతూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం పోచమ్మ పండుగ ఉండడంతో డప్పు కొట్టడానికి వెళ్లారు. ఇంటికి వచ్చి నీరసంగా ఉండడంతో కుటుంబ సభ్యులు నిర్మల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందారని వైద్యులు తెలిపారు. నిగులపు రాజుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. శంకర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరిది నిరుపేద కుటుంబం కాగా.. ఇంటికి పెద్ద దిక్కును కోల్పోవడంతో వారి కుటుంబాలు శోకసంద్రంలో మునిగాయి. ప్రభుత్వం కుటుంబ సభ్యులను ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఉపాధి కూలీ మృతి

నార్నూర్, ఏప్రిల్ 21 : ఎండతీవ్రతకు వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి చెందిన ఘటన ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని భీంపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌహాన్ కేశవ్(60) పదిహేను రోజులుగా ఉపాధి కూలీ పనులకు వెళ్తున్నట్లు తెలిపారు. వడదెబ్బతో బాధపడుతున్న కేశవ్‌కు వైద్యపరీక్షలు చేయించినా పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందినట్లు తెలిపారు.

సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి

నిర్మల్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్ 21 : ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. నిర్మల్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరించారు. నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం ప్రజావాణి నుంచి వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పరిష్కరించాలన్నారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా జిల్లాలోని మారుమూల ప్రాంతాల ప్రజల సహాయార్థం టెలీఫోన్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి టెలీఫోన్ ద్వారా వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రత్నకల్యాణి, అధికారులు పాల్గొన్నారు.

గ్రామ బహిష్కరణ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వినతి

కలెక్టరేట్‌కు వచ్చిన బాధితులు

తమను గ్రామ బహిష్కరణ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. నిర్మల్ జిల్లాలోని సత్తనపల్లి గ్రామ పరిధిలోని రాంరెడ్డిపల్లెకు చెందిన కుంచెపు విజయ, కుంచెపు ఎల్లయ్యలను గ్రామానికి చెందిన కొందరు పెద్దలు గ్రామ బహిష్కరణ చేశారని కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. వారిపై చర్యలు తీసుకోవాలని గతంలో వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. అధికారులు స్పందించి వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో కోరారు.

ఉద్యోగాలు ఇప్పించాలని వినతి

కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన ఉద్యోగులు

కొన్నేళ్లుగా తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లో విధులు నిర్వహిస్తున్న తమకు డీఎంఈ పరిధిలోకి తీసుకుని ఉద్యోగాలు ఇప్పించాలని కోరుతూ సోమవారం ఉద్యోగులు కలెక్టర్ కార్యాలయానికి వచ్చి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ.. నిర్మల్ జిల్లాకు వైద్య కళాశాల మంజూరు కావడంతో డీఎంఈ పరిధిలోకి వెళ్లిందన్నారు. ఇన్నేళ్లుగా టీవీవీపీలో పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందన్నారు. ఇటీవల ప్రకటించిన వైద్య కళాశాలలో 52 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. పోస్టుల భర్తీకి అనుభవం ఉన్న వారికి వెయిటేజి మార్కులు ఇస్తామని చెప్పి ఇవ్వలేదన్నారు. పోస్టులలో తమకు ఉద్యోగాలు కల్పించాలన్నారు. ఇంతవరకు మార్కుల లిస్టు ప్రకటించలేదన్నారు. అనుభవం ఉన్న తమకు ఉద్యోగాలు కల్పించాలని కలెక్టర్‌ను కోరారు.

పీఎం మోదీ నుంచి అవార్డు అందుకుంటున్న కలెక్టర్ రాజర్షి షా

అందరి సహకారంతోనే పురస్కారం

ఎదులాపురం, ఏప్రిల్ 21 : ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా సోమవారం ప్రధానమంత్రి మోదీ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ప్రధానమంత్రి ప్రజాస్వామ్య పరిపాలనలో భాగంగా నార్నూర్ మండలం ఎంపిక అయినందుకు ఈ అవార్డు వరించింది. కాగా.. ఇటీవల ఆరోగ్య పాఠశాల అమలుతో విద్యార్థుల జీవనశైలిలో మార్పు తీసుకొచ్చినందుకు ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డును ఢిల్లీలో అందుకున్నారు. కొద్ది రోజులకే సివిల్ సర్వీస్ డే సందర్భంగా ఏకంగా ప్రధాని మోదీ చేతుల మీదుగా పురస్కారం అందుకోవడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు, అధికారులు, ప్రభుత్వ సహకారంతోనే పురస్కారం వచ్చిందని తెలిపారు. పురస్కారం రావడానికి కృషి చేసిన అందరికి ధన్యవాదాలు తెలిపారు.

ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

ఎదులాపురం, ఏప్రిల్ 21 : ఒకరు విధుల్లో మద్యం సేవించి ఉండడం, మరోకరిపై క్రిమినల్ కేసు నమోదుకావడంతో ఇద్దరు కానిస్టుబుళ్లను సస్పెండ్ చేస్తూ ఎస్పీ అఖిల్ మహాజన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆదిలాబాద్ మహిళా పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న సి.గంగన్నపై క్రిమినల్ కేసు నమోదై ఉంది. అలాగే తాంసి పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న కె.పోచన్న విధులో మద్యం సేవించి ఉన్నాడు. దీంతో వారిద్దరిని సస్పెండ్ చేసినట్లు ఎస్పీ తెలిపారు.

ప్రజావాణిలో 90 దరఖాస్తులు

ఆదిలాబాద్, ఏప్రిల్ 21(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ కలెక్టర్ కార్యాలయం మీటింగ్ హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వివిధ సమస్యల పరిష్కారానికి 90 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి మండుటెండను లెక్క చేయకుండా ప్రజలు ప్రజావాణికి వచ్చి దరఖాస్తులు సమర్పించారు. వినతులను స్వీకరించిన రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ శ్యామలదేవి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తాంసి మార్కెట్ యార్డులో జొన్నల కొనుగోళ్లు

పరిమితి పెంచండి

- కొనుగోళ్లను 8.65 క్వింటాళ్ల నుంచి 15 క్వింటాళ్లు చేయండి..
- మంత్రులు హామీ ఇచ్చినా.. ఉత్తర్వులు రాని వైనం..
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో నష్టపోతున్న రైతులు

ఆదిలాబాద్, ఏప్రిల్ 21(నమస్తే తెలంగాణ) :ఆదిలాబాద్ జిల్లాలో రైతులు పరిస్థితి అధ్వానంగా మారింది. జొన్నల పంట పరిమితి విషయంలో స్పష్టత ఇవ్వకపోవడంతో రైతులు నష్టపోవాల్సిన దుస్థితి నెలకున్నది. జిల్లాలో ఏటా యాసంగిలో శనగను అధికంగా సాగు చేస్తుండగా.. ఈ యేడాది జొన్న పంటను 1.12 లక్షల ఎకరాల్లో వేశారు. దిగుబడులు ఎకరాకు 18 క్వింటాళ్ల వరకు వచ్చాయి. పక్షం రోజుల నుంచి దిగుబడులు ప్రారంభం కాగా మూడు రోజులు కిందట కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ప్రాథమిక సహకార సంఘాల ద్వారా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలుకు రూ. 3,371తో ఎకరాకు 8.65 క్వింటాళ్ల చొప్పున కొనుగోలు చేస్తున్నారు.

ఆదేశాలు వచ్చేదెన్నడో?

దిగుబడి ఎకరాకు 18 క్వింటాళ్ల వరకు వస్తున్నందున.. ప్రభుత్వం సేకరించి కొనుగోలు పరిమితి పెంచాలని రైతులు ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. మద్దతు ధర క్వింటాలుకు రూ.3,371 ఉంటే.. ప్రైవేటు వ్యాపారులు రూ.2500లతో కొనుగోలు చేస్తున్నారని, దీంతో తాము భారీగా నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. ఇటీవల జైనథ్ మండలంలోని పూసాయిలో జరిగిన భూ భారతి అవగాహన సదస్సుకు రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అధికార పార్టీకి చెందిన నాయకులు 14 క్వింటాళ్లు కొనుగోలు చేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. కానీ.. ఇంకా ప్రభుత్వ ఉత్తర్వులు రాకపోవడంతో ఎకరాకు 8.65 క్వింటాళ్ల చొప్పున కొనుగోలు చేస్తున్నారు. రైతుల వద్ద నుంచి ఒకసారి పంటను తీసుకుంటే ఆన్‌లైన్‌లో మరోసారి కొనుగోలు చేసే అవకాశం లేదని మార్కెటింగ్ అధికారులు తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు భారీగా నష్టపోవాల్సిన పరిస్థితి నెలకున్నది. దిగుబడి బాగా వచ్చినందన ఎకరాకు 15 క్వింటాళ్లు కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వ నిబంధనతో నష్టం..

నేను నాలుగెకరాల్లో జొన్న సాగు చేశా. 60 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. తాంసి మార్కెట్ యార్డులో పంటను విక్రయానికి తీసుకురాగా అధికారులు ఎకరాకు 8.65 క్వింటాళ్ల చొప్పున 34 క్వింటాళ్లను కొనుగోలు చేశారు. మిగిలిన 25 క్వింటాళ్లు ఎక్కడ అమ్మాలో తెలియడం లేదు. ప్రైవేటు వ్యాపారులు క్వింటాలుకు రూ.2500 ఇస్తామంటున్నారు. దీంతో రూ.22 వేలు నష్టపోతున్నా. ధర పెంచమని వ్యాపారులను అడిగితే వారు ఒప్పుకోవడం లేదు. ప్రభుత్వం దిగుబడికి అనుకూలంగా కొనుగోలు పరిమితులు పెట్టాలి. ఎకరాకు 14 క్వింటాళ్లు కొనుగోలు చేస్తామని అధికార పార్టీ నాయకులు చెబుతున్నా అమలుకావడం లేదు. రైతులు నష్టపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఎకరాకు కనీసం 15 క్వింటాళ్ల చొప్పున కొనుగోలు చేసి రైతులు నష్టపోకుండా చూడాలి. **- బెండారి రాజ్‌కుమార్, రైతు, కప్పర్ల, తాంసి మండలం**

ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ శ్యామలదేవి